


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**చదవడం పూర్తి చేయగానే** అతడు దుఃఖం ఆపుకోలేక పోయాడు. అయితే అతడి దుఃఖాన్ని ఆమె మరోలా అర్థం చేసుకుంది. ‘‘మీరు మరీ ఇంత సెన్సిటివ్ అయితే ఎలా?’’ అంది.

అతడు తేరుకున్నాడు.‘‘ఈ గేయాలకు మల్లే నీకూ నేను శాశ్వతం కల్గిస్తాను.’’

పైకి అనలేదు. మనసులో అనుకున్నాడు.

4

**మామూలు** రఫ్ స్కెచ్ వేయడానికి అతడికి వారం రోజులు పట్టింది. ముందొకటి వేశాడు. చింపేశాడు. మరొకటి వేశాడు. చెరిపేశాడు. కార్తికేయ పని ప్రారంభించిన మొదటి రోజే వివేకానంద వెళ్ళిపోయాడు. పది రోజుల తరువాత ఢిల్లీ నుంచి అతడు తిరిగి వచ్చేసరికి... కార్తికేయ ఇంకా ఆ స్థితిలోనే ఉన్నాడు.

‘‘ఏమిటి? పదిరోజుల్లో ఈ పనేనా జరిగింది?’’ విస్మయంగా అడిగాడు వివేకానంద.

కార్తికేయ విషాదంగా నవ్వాడు. ‘‘ఒక్క గీత కూడా గీయలేకపోతున్నాను. అనూజ్ఞ ఎదురుగా నిలబడితే, ఆమె వెనుకున్న వాస్తవమే రాక్షసిలా కనబడుతోంది.’’

‘‘నేను కూడా అక్కడ ఏ పనీ చేయలేదు. మొత్తం డాక్టర్లందర్నీ కలుసుకున్నాను. కొన్ని థెరపీలు ఉన్నాయట కానీ కేవలం కొన్ని నెలల పాటు మాత్రమే పని చేస్తాయట. మనిషిని మాత్రం చాలా హింసకు గురి చేస్తాయట. కొద్దినెలల పాటు బ్రతుకుని పొడిగించటం కోసం ఆమెకు అంతా చెప్పేసి ఆ తరువాత ఆ శరీరాన్ని బాధలకు గురి చేయాలా? లేకపోతే ఇలాగే ప్రశాంతంగా మరణించనివ్వాలా? నేనెటూ తేల్చుకోలేకపోతున్నాను.’’

‘‘అనూజ్ఞలో మాత్రం ఏ మార్పూ లేదు’’.

‘‘ఆ వ్యాధి తత్వమే అది. చివరివరకూ ఏమీ తెలీదు.’’

ఇద్దరూ ముందు హాల్లో కూర్చుని ఉన్నారు. అప్పుడు సమయం పన్నెండు గంటలయింది.

''మీరు నన్ను క్షమించండి. నా పరిస్థితి నాకే సిగ్గుగా ఉంది'' కార్తికేయ నొచ్చుకుంటున్నట్టు అన్నాడు. ''అనూజ్ఞని నేనింతగా అభిమానిస్తున్నానని నాకు తెలీదు. అలాంటి అనూజ్ఞ ఇక ఉండబోదంటే నా చేతులు సహకరించడం మానేశాయి. కానీ ఎలాగయినా సరే ఆ చిత్రం పూర్తి చేసి తీరుతాను.''

''ఎంత సమయమన్నా తీసుకో. చివరి రోజుల్లో నా కూతుర్ని ఆనందంగా ఉంచాలన్న కోరికతో నిన్ను రప్పించాను తప్ప నాకు ఆచిత్రం మీద ఏ ఉత్సాహమూ లేదు.''

అప్పుడు తలుపు దగ్గర చప్పుడైంది. అనూజ్ఞ అక్కడ నిలబడి ఉంది. ఆ సంభాషణ అంతా విన్నట్లు ఆమె మొహం పాలిపోయింది. రక్తం ఇంకిపోయి తెల్లగా మారింది. దుఃఖాన్నీ, ఆందోళననీ నొక్కిపెట్టడానికి విఫలయత్నం చేస్తున్నట్లు ఆమె పెదవులు వణుకుతున్నాయి.

ఇద్దరూ ఆమెను చూసి అప్రయత్నంగా కుర్చీల్లోంచి లేచి నిలబడ్డారు. వివేకానంద రెండడుగులు ముందుకువేసి ''అ...నూ... జ్ఞ...'' అన్నాడు.

''అంతా విన్నా నాన్నా.''

''లేదమ్మా. ఏమీ జరగలేదు. డాక్టర్లు కేవలం అనుమానంగా చెప్పారంతే''

''దేశంలోకెల్లా పెద్ద ఆస్పత్రి నాన్నా అది. అక్కడ అబద్ధం చెప్పారని నువ్వు ఆత్మవంచన చేసుకుని నీ కూతుర్ని నమ్మించబూనడం అనవసరం.''

''అనూజ్ఞా''

''ఒక మనిషికి మరణం దగ్గరైందని తెలిసినప్పుడు ఆ విషయాన్ని ఆ మనిషికి చెప్తే, చివరి కొద్ది కాలాన్నీ ఎలా గడపాలా అని నిర్ణయించుకునే అవకాశం ఆ మనిషికి ఉంటుంది నాన్నా. ఆ మరణించేది ఎంత నీ కూతురైనా, ఆమె తన జీవితపు ఆఖరి క్షణాలు ఎలా గడపాలీ అని నిర్ణయించే హక్కు నీకు లేదు.''

చిన్నపిల్లాడిలా ఏడ్చెయ్యడానికి వివేకానంద ఒక మెట్టు దగ్గరగా ఉన్నాడు.

''అలా అనకమ్మా నువ్వేం చెప్తే అది చేస్తాను. నువ్వేం కావాలంటే అది తీసుకొస్తాను.''

''అబద్ధం చెప్పవుగా నాన్నా''

వివేకానంద కదిలిపోయి కూతుర్ని చప్పున దగ్గరకి లాక్కుని ''మరణానికి మూడు నెలల దూరంలో ఉన్న కూతురితో ఏ తండ్రీ అబద్ధం చెప్పడమ్మా'' అన్నాడు.

తండ్రి భుజం మీద తల ఆన్చి ఉన్న అనూజ్ఞ, మొహం కొద్దిగా పైకెత్తి వెనకున్న కార్తికేయని చూసి కన్నుకొట్టింది. దూరంగా నిలబడి వాళ్ళిద్దర్నీ ప్రేక్షకుడిలా చూస్తున్న కార్తికేయకి అది సరీగ్గా కనబడలేదు.

''నాన్నా...'' మెలోడ్రమెటిక్‌గా అంది. ''నాకు ముత్తయిదువుగా చనిపోవాలని ఉంది నాన్నా. ప్రేమించినవాడు భర్తయి, నా కాళ్ళకి మట్టెలు పెట్టి, నా మొహానికి పసుపురాసి నన్ను చితి ఎక్కిస్తే ఆ సంతృప్తితో వెళ్ళిపోవాలని ఉంది. శరీరం చితి ఎక్కేముందు మెళ్ళో మంగళసూత్రం కావాలని ఉంది. నా కోరిక తీరుస్తావా నాన్నా'' అంది.

కూతుర్ని మరింత పొదివి పట్టుకుని ''తప్పకుండా తీరుస్తానమ్మా'' అన్నాడు.

కార్తికేయ కంగారుగా అడుగు ముందుకేసి ''అనూజ్ఞా'' అన్నాడు.

ఆమె అతడి వైపు చూసి నవ్వి తండ్రి వైపు తిరిగి, ''థాంక్స్ నాన్నా" అంది. ఇద్దరూ అయోమయంగా ఆమె వైపు చూసారు.

"సరీగ్గా నటించకపోతే మెలో డ్రామా ఎంత దరిద్రంగా ఉంటుందో, బాగా నటిస్తే అది అంత రక్తికడుతుందని డ్రామా థియేటర్ క్లాసులో పాఠం చెపుతూ మా లెక్చరర్ అనేవాడు. స్ట్రీట్–ప్లే, స్టేజ్– ప్లే లే కాదు, మెలోడ్రామా కూడా నేనంత బాగా నటించగలనని నమ్మకం కుదిరింది'' అంది తడి కళ్ళని తుడిచేసుకుంటూ.

''ఏమిటమ్మా ఇది?'' అన్నాడు వివేకానంద మరింత అయోమయంగా.

''లేకపోతే ఏమిటి నాన్నా? నాకు హడ్జ్కిన్స్ వ్యాధా? నాకు చెప్పకుండా దీన్ని మీరింతకాలం దాచారా? మీలో మీరే కుమిలిపోతూ ఏవేవో నిర్ణయాలు తీసుకున్నారా? అందుకేనా 'కార్తికేయని ప్రేమించాను' అని చెప్పగానే మా ఇద్దర్నీ తీసుకొచ్చి ఈ దీవిలో వదిలేసేవు? ఇంకా నయం. అదృష్టవశాత్తు నేను ఈ రోజు మీ సంభాషణ వినకపోయి ఉంటే, ఆ బొమ్మ పూర్తయ్యాక ఇక నేనెప్పుడు ఛస్తానా అని మీ ఇద్దరూ ఎదురుచూస్తూ కూర్చునేవారన్నమాట.''

''ఇంతకీ నువ్వు చెప్పేది?''

''పపట్‌లాల్ అనే కుర్ర డాక్టర్ని ఏడిపించటం కోసం నేనే రిపోర్టులు మార్చాను. నావి తీసేసి హడ్జ్కిన్స్ వ్యాధి ఉన్న అమ్మాయి రిపోర్టులు నా ఫైల్లో పెట్టాను...''

ఆమె మామూలుగా మాట్లాడిన ఆ రెండు మాటలూ వారికి అర్ధం కావటానికి కొంచెంసేపు పట్టింది. ఎడారిలో రోజంతా దాహంతో దిక్కు తోచక తిరిగినవాడికి, ఒయాసిస్సు కనబడితే ఎలా ఉంటుందో... ఎంత ఉత్సాహంతో పరుగెడతాడో... అలా వెళ్ళి కూతుర్ని గాలిలోకి లేపాడు వివేకానంద.

దూరం నుంచి చూస్తున్న కార్తికేయ మానసికోద్వేగం అంత కన్నా తక్కువగా ఏమీ లేదు. గుండె వేగం తెలుస్తోంది. సంతోషం మనసు చుట్టూ రంగుల రాట్నంగా తిరుగుతోంది. తన సంతోషం చూసి అతడికే ఆశ్చర్యం వేసింది. తన ప్రమేయం లేకుండానే ఆ అమ్మాయి లతలా, ఇంతలా తన మనసుని అల్లుకుపోయిందనీ, ఆమె మరణం గురించి తెలిసినప్పటి నుంచి ఇంత అంతర్వేదన తనలో కదుల్తోందనీ అతడికి తెలీదు.

ఒక మరణం కోసం ఎదురు చూస్తూ ఒక జీవచిత్రం వేయటం ఎంత కష్టమో అతడికి మాత్రమే తెలుసు. వేస్తున్నంత సేపూ అతడు అదే ఆలోచనతో ప్రతి క్షణమూ నరకయాతన అనుభవించాడు. ఆ బొమ్మ సరీగ్గా రావటం లేదని అతడికి తెలుస్తూనే ఉంది. కానీ ఏమీ చేయలేకపోయాడు.

అతడు తన ఆలోచనల్లోనే ఉన్నాడు కానీ లీలగా తండ్రీ కూతుళ్ళ సంభాషణ వినపడుతూనే ఉంది.

‘‘సర్దుకో అమ్మా. సామాన్లు సర్దుకో. ఇంకో నాలుగ్గంటల్లో పోర్ట్ బ్లేర్ నుంచి విమానం ఉంది. వెళ్దాం...’’

‘‘మరి బొమ్మ...’’

‘‘బొమ్మా? ఇంకా బొమ్మ ఏమిటి? దాని సంగతి తరువాత చూద్దాంలే. ముందు అర్జంటుగా మనం ఢిల్లీ వెళ్ళాలి.’’

అనూజ్ఞ కార్తికేయ దగ్గరకి వచ్చింది. ‘‘ఏమిటి – ఎలా ఉంది? ఇంత కంగారు పెట్టినందుకు కోపంగా ఉందా?’’ అంది నవ్వుతూ.

‘‘లేదు. ఏదో బరువు తీసేసినట్టుంది. నిజంగా... నిజంగా నాకు చాలా సంతోషంగా ఉంది అనూజ్ఞా. ఇన్నాళ్ళూ మేము ఎంత కుమిలిపోయామో నీకు తెలీదు...’’

ఆమె మరింత నవ్వేసి ‘‘చెప్పనవసరంలేదు. మీ కళ్ళలో తడే తెలుస్తోంది’’ అంది. తన కళ్లు అశ్రుపూరితాలయ్యాయని అప్పుడు గమనించాడు. కళ్ళు తుడుచుకుంటూంటే ఆమె అంది. ‘‘థాంక్స్, నేను ప్రేమించినంతగా మీరు నన్ను ప్రేమించడం లేదేమోనని ఇంతకాలం నా మనసులో ఏ మూలో కాస్త అనుమానం ఉండేది. నా మీద మీకున్న ప్రేమని మీ కంటిచుక్క చెపుతోంది. థాంక్స్.’’

5

**‘‘అసంభవం’’** అన్నాడు డాక్టర్ భరద్వాజ. అతడి మొహం ఎర్రగా జేవురించింది.

వివేకానంద అతడి సంచలనాన్ని పట్టించుకోకుండా ‘‘అవును డాక్టర్. ఆ అమ్మాయి ఈ విషయం చెప్పగానే ఒక్క క్షణమైనా అక్కడ ఉండకుండా తీసుకొచ్చేశాను. ఇదే వ్యాధి ఉన్న మరో పేషెంట్ బ్లడ్ రిపోర్టు మార్చిందట. ఐయామ్ సారీ’’ అన్నాడు.

ఏం మాట్లాడాలో తెలియనట్లు భరద్వాజ ముగ్గురి వైపు చూస్తూ ఉండిపోయాడు. అనూజ్ఞ నొచ్చుకుంటూ ‘‘క్షమించండి డాక్టర్‌గారూ. ఇదింత సీరియస్ అయి, మా వాళ్ళందర్నీ బాధపెడుతుందని అనుకోలేదు’’ అంది.

భరద్వాజ కుర్చీలోంచి లేచి, ‘‘నాతో రండి’’ అంటూ లోపలికి నడిచాడు. అతడు ఈ విషయం పట్ల ‘హర్ట్’ అయ్యాడో, లేక జరిగిన పొరపాటుకి సిగ్గుతో పశ్చాత్తాప పడుతున్నాడో గానీ, మొత్తం మీద సీరియస్ గా ఉన్నాడు.

అనూజ్ఞని లోపలికి తీసుకు వెళ్లి, లాబ్ లో ఆమె చేతి నుంచి రక్తం తీసుకుని పరీక్షకి పంపించాడు. అక్కణ్నుంచి రికార్డు రూమ్‌కి వెళ్లాడు. పదిహేను నిముషాలు వెతికి చివరికి 'సుజాత' అని వ్రాసి ఉన్న ఫైలు తీశాడు. దాన్ని తీసుకుని తన ఛాంబర్‌లోకి నడిచాడు.

ఛాంబర్ ముందు కూర్చుని ఉన్న వివేకానందకీ, కార్తికేయకీ లోపలేం జరుగుతుందో తెలియటం లేదు. భరద్వాజ వచ్చి తన కుర్చీలో కూర్చుంటూ, అప్పటి వరకూ నిలబడి ఉన్న అనూజ్ఞకి చేయి సాచి చూపించి, ''కూర్చోండి'' అన్నాడు. అనూజ్ఞ అతని ఎదుటి కుర్చీలో కూర్చుంది. రక్తం తీసిన చేతి దగ్గర మంటగా ఉంది. బొటనవేలితో అక్కడ నొక్కిపట్టి, అతడు తెచ్చిన ఫైళ్ళ వైపు చూస్తూ కూర్చుంది. భరద్వాజ డ్రాయర్ లోంచి 'అనూజ్ఞ' అని వ్రాసి ఉన్న ఫైలు తీశాడు.

మొదటి నాలుగు పేజీలూ తిప్పాక కనబడింది. బ్లడ్ రిపోర్టు! A.S అని ఉంది. అతడు సుజాత ఫైలు మీద పేరు చూశాడు. ఎ.సుజాత... అంటే... A.S.

అనూజ్ఞ అతడి అయోమయాన్ని స్పష్టంగా చూస్తోంది. సుజాత తాలూకు ఫైలు దగ్గరకి లాక్కొని, అందులోంచే బ్లడ్ రిపోర్టు తీశాడు. అనూజ్ఞకి తెలుస్తోంది. ఆ కాగితం తను పెట్టిందే. నవ్వు ఆపుకుంది.

భరద్వాజ ఆ కాగితం మీద పేరు చూశాడు.. కంప్యూటరైజ్డ్ మార్కింగ్ IX – VCP – XR – NAME – K. ANUJNA. ఫైళ్ళలో రిపోర్టుల మార్పిడి జరగటం యదార్థమే. అందులో సందేహం లేదు. కానీ...

డాక్టర్‌తో పాటు లోపల్నుంచి బయటికి వస్తూన్న కూతుర్ని చూసి ఆందోళనగా లేచి నిలబడ్డాడు వివేకానంద. కార్తికేయ తన ఉద్వేగాన్ని ఆపుకోవటానికి చాలా ప్రయత్నించ వలసి వచ్చింది. లోపల్నుంచి వస్తున్న వారికీ, బయట వేచి ఉన్న వారికీ మధ్య నిలచిన క్షణకాలపు నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ చిన్న స్వింగ్ డోర్ చప్పుడే భయంకరంగా వినిపించింది. ఆ భయంకర శబ్దం తరువాత మళ్ళీ నిశ్శబ్దం. అది కేవలం నాటకీయంగా ఉండడంకోసం అనూజ్ఞ కల్పించిందే!

అంత సీరియస్ వాతావరణం కల్పించిన తరువాత ఒక్కసారిగా దాన్ని తేలిక చేస్తూ నవ్వేసింది అనూజ్ఞ. నవ్వుతూ అంది– ''పద నాన్నా బ్రహ్మాండమైన పార్టీ ఇవ్వాలి నాకు...''

''అంటే... అంటే...''

''రిపోర్టులు మారిన మాట నిజమే.''

ఒక్కసారిగా హృదయంలో అప్పటివరకూ ఉన్న బాధంతా ఎవరో చేత్తో తీసేసినట్లయింది. ఆ మాటలకి వివేకానంద కన్నా కార్తికేయ ఎక్కువ రిలీఫ్ పొందాడు. ఒక కూరంగం సంతోషంతో ఎగిరినట్టు, ఒక తరంగం ఆనందంతో అంతరంగాన్ని తాకినట్టు, ఒక కరుణారస సింధువు రాలినట్టు, ఒక శరణాగత బంధువు ఆశీర్వదించినట్టు, ఒక శరత్తు విచ్చినట్టు. ఒక మలయమారుతం వీచినట్టు...

''ఏమిటి ఇద్దరూ ఇంకా అలా కళ్ళప్పగించి చూస్తున్నారు?''

అప్పటికి తేరుకున్నాడు వివేకానంద. డాక్టరువైపు నిప్పులు కక్కే కళ్ళతో చూస్తూ, ''ఒక చిన్న కాగితం ఒక ఫైలు నుంచి మరొక ఫైల్లోకి మారినంత మాత్రాన మీరింత దారుణమైన నిర్ణయానికి వస్తారా? ఇదంతా మీకు చిన్నపిల్లల వ్యవహారంలా ఉందా?'' అంటూ అరిచాడు.

భరద్వాజ మాట్లాడకుండా తలవంచుకున్నాడు.

''ఒక మంత్రి వ్యవహారంలోనే ఇలా జరిగితే, మామూలు కేసుల్లో మీరెంత నిర్లక్ష్యం వహిస్తున్నారో నాకర్థం కావటంలేదు.''

అనూజ్ఞ కల్పించుకుని, ''ఇదంతా వాళ్ళ తప్పయినట్టు అలా విరుచుకు పడతావేమిటి నాన్నా? అసలేమైనా తప్పుంటే అది నాది. రిపోర్టులు మార్చింది నేనన్న విషయం మర్చిపోయావా ఏమిటి? అయినా ఈ టైములో కోపం ఏమిటి? మా గురువుగార్ని అడిగితే 'సంతోషం... కోపం... దుఃఖం అన్ని రకాల స్థాయీ భావాలు. కోపం కోసం సంతోషాన్ని వదులుకునే వాడు దురదృష్టవంతుడు. సంతోషించవలసిన సమయంలో దాన్ని కోపంతో నింపేవాడు వ్యర్థుడు' లాటివి చెపుతారు. ఏం మిత్రాజీ. అంతేనా?''

కార్తికేయ నవ్వి ఊరుకున్నాడు. నిజానికి అతడు ఈ మాటలు వినటం లేదు. తుఫానులో కొట్టుకుపోయిందనుకున్న అపురూప కళాఖండం నాశనం కాలేదని తెలిసినప్పుడు దాన్ని అపురూపంగా చూసుకునే శిల్పిలా అనూజ్ఞని చూస్తున్నాడు.

డాక్టర్‌కి 'థాంక్స్' చెప్పి ముగ్గురూ బయటకొచ్చారు. ''ఇంత సంతోష సమయంలో నాన్నగారు పార్టీ ఇస్తానన్నారు. మరి మీరేమి ఇస్తారు?'' అంది అనూజ్ఞ.

''ఏం కావాలి అనూజ్ఞా?''

''తరువాత కాదనకూడదు. ప్రామిస్...'' అని, అతడు వాగ్దానం చెయ్యగానే ''ఆ చిత్రం పూర్తి చేయాలి'' అంది.

కార్తికేయ, వివేకానంద ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. అనూజ్ఞ కొనసాగించింది. ''నేను మీ సంభాషణ విన్నాను కదా. కళ్ళ ముందు నేను మరణిస్తూ ఉంటే ఆ బాధని మింగుకుంటూ చిత్రం వేయటం కుదర్లేదని అన్నారు మీరు. ఇప్పుడిక మరణం ప్రసక్తి లేదు కాబట్టి మీరు అద్భుతంగా వేయగలరు. అండమాన్స్ అవసరం లేదనుకుంటే ఇక్కడే వేయండి. కానీ చిత్రం మాత్రం పూర్తి చేయాలి.''

''కానీ ఇప్పటి వరకూ వేసిన చిత్రమే బాగా రాలేదు.''

''మళ్ళీ మొదటి నుంచీ వేయండి. వాగ్దానం చేశారుగా...''

కార్తికేయ ఇబ్బందిగా వివేకానంద వైపు చూశాడు. వివేకానంద కల్పించుకుని ''ఇప్పుడే– ఈ క్షణమే అన్నీ నిర్ణయించుకోవాలా? ముందు ఈ ఆనందాన్ని సెలబ్రేట్ చేద్దాం పదండి'' అని డ్రైవర్‌తో ఏ హోటల్‌కి వెళ్ళాలో చెప్పాడు.

## 6

**అతడి** జీవితంలోకెల్లా అత్యంత ముఖ్యమైన, విషాదకరమైన అధ్యాయం అది. చిత్రం పూర్తి చేయటం కోసం అతడు ఆ దీవికి మళ్ళీ పంపబడ్డాడు.

ఒంటరిగా అండమాన్స్‌లో గడిపిన ఆ పక్షం దినాలూ... అది విషాదం కూడా కాదు. శూన్యం. ఒకప్పుడు అతడే తనలో వాక్యూమ్ ఏర్పడిందని అన్నాడు. ఒక్క గీత కూడా గీయలేకపోతున్నానని బాధ పడ్డాడు. ఇప్పుడు అంతకన్నా ఘోరమైన స్థితిలోకి జారుకున్నాడు.

అనూజ్ఞ మళ్ళీ కాలేజీలో చేరిందో లేదో కూడా తెలీదు. అతనొక్కడే అండమాన్స్ వచ్చాడు. ఆమె తండ్రి ఆమెకి ఏమి చెప్పాడో కూడా అతడు పట్టించుకోలేదు.

ప్రారంభంలో ఏ కళాకారుడైనా అప్పుడే విచ్చిన గులాబిపువ్వులాటి వాడు. స్వచ్ఛమైన మంచులో తడిసి మైమరచి పోవాలని కోరుకుంటాడు. స్వార్థముండదు. గుర్తింపు అవసరం ఉండదు. తన వృత్తంలో తానే ఇమిడిపోయిన బిందువు అతడు. ఆ వృత్తం బయట ఏముందో అతనికి అవసరం లేదు. తన చుట్టూ గీసుకున్న చిన్న సామ్రాజ్యానికి అతను రారాజు. తన మనసుకి మాత్రమే అతడు జవాబుదారీ.

ఒకప్పుడు కార్తికేయ ఆ స్థితిలోనే ఉండేవాడు. బూట్‌పాలిష్ చేసేవాడు. ఇరానీ హోటల్‌లో టీ తాగేవాడు. చింకిచాప మీద పడుకునేవాడు. ఏ అర్ధరాత్రో హృదయంలోంచి తపన మొలకెత్తి, గీయకపోతే లాభంలేదని మనసు మారాం చేసినప్పుడు, అసంతృప్తి మనస్సుని కలచివేసినప్పుడు, గుండెల్లో ఒక జల ఎగజిమ్మితే, దాన్ని కుంచెల్తో బందీ చేసేవాడు. అది ‘ఎవరికోసమూ కాదు. తనకోసమే!

తనలో వర్జినిటీ పోయిందని అతనికి తెలుస్తోంది. వర్జినిటీ పోవటం తప్పేమీ కాదు. ప్రతి విషయానికీ ఒక ఋతువు ఉంటుంది. విత్తనం వేయటానికి, మొక్క అంకురించటానికీ, పుష్పించటానికీ, చివరికి మరణించటానికీ. కొత్తలో కళాకారుడు బొమ్మ వేయగానే తృప్తిగా చూసుకుంటాడు. కొంతకాలం అయ్యాక నిరంతర కరతాళధ్వనులు– అదే వర్జినిటీ పోవటం. తప్పేంలేదు. వర్జినిటీని ఎప్పుడూ పవిత్రంగా చూసుకుంటే ఇక సృష్టి ఎక్కడ?

శ్రీకళ్యాణి అతడి కళని ఎప్పుడూ గుర్తించ లేదు. అటువంటి స్థితిలో మరో అమ్మాయి అతడిలో ఆర్టిస్టుని గుర్తించి ప్రోత్సహించింది. రక్తం ఇచ్చి బొమ్మ గీయించింది. నైతిక విలువలకి మర్యాదనిచ్చి అతడు ఆమెని దూరం చేసుకున్నాడు. కానీ దురదృష్టవశాత్తు ‘ఇది నైతికమా కాదా’ అన్న విషయాన్ని ‘కళ’ చూడదు. దాని దాహం వేరు. అదే అతడిని నిర్దాక్షిణ్యంగా హింసిస్తోంది. అతడి మనసు అంతరాంతరాల్లో ఎక్కడో ఆమెను ఆశిస్తున్నాడు. ఒక ప్రియురాలిగా కాకపోవచ్చు. శృంగారపరంగా కాకపోవచ్చు. కానీ ఆమె సామీప్యం అతడికి కావాలి. ‘నేనిదంతా ఎవరికోసం చేస్తున్నా’

అన్న ప్రశ్న ప్రతి మనిషినీ ఎప్పుడో ఒకప్పుడు  స్పృశిస్తూనే ఉంటుంది. అతడు ఆ క్షణం అనూజ్ఞ కోసం అంతలా పరితపించటాన్ని ఎవరయినా ఛాందసవాదులు ఎత్తిచూపితే, వారికి నిజమైన కళాకారుడి గురించి ఏమీ తెలీదన్నమాట.

సముద్రతీరాన గంటల తరబడి కూర్చునేవాడు. వచ్చిపోయే కెరటాలకేసి చూస్తూ ఉండేవాడు. ఆ దీవిలో ఎవరూ అతడిని పలుకరించే వారు కాదు. అదంతా ఏకాగ్రత అనుకునేవారు. అతడి మధన వారికేం తెలుసు?

అతడు అలా ఒంటరి సూర్యోదయాల కేసీ, చీకటి సూర్యాస్తమయాల కేసి చూస్తూ రోజులు గడుపుతూంటే పగళ్ళు దిగులుగా గడిచేవి. చీకట్లు జాలిగా పలకరించేవి. సముద్రం ఒకటే తోడుగా ఉన్నట్టుండేది.

అప్పుడప్పుడు కళ్యాణి గుర్తొచ్చేది. ‘పడిపోయిన వ్యాపారాన్ని లేవనెత్తే ప్రయత్నంలో తలమునకలై ఉంటుందేమో’ అనుకునేవాడు. అనూజ్ఞ గుర్తొచ్చేది. ‘దాదాపు రెండో జన్మకదా. పాత స్నేహితులతో హుషారుగా గడిపేస్తూ ఉండి ఉంటుంది’ అనుకునేవాడు. ఒంటరి ఎడారిలో స్నేహ దాహార్తితో ఉన్నవాడిని అందరూ వదిలేసి వెళ్ళిపోయిన భావం. మళ్ళీ అంతలోనే ‘ఇదేమిటి? నేనింత సంకుచితంగా ఆలోచిస్తున్నాను?’ అన్న సంఘర్షణ. ఇంత ఘర్షణలోనూ అతడు తన బాధ్యత మర్చిపోలేదు. అప్పుడప్పుడు బొమ్మ వేయటానికి ప్రయత్నం చేసేవాడు. ఒక్క గీతా సరీగ్గా వచ్చేది కాదు. అప్పటికే అక్కడికొచ్చి పదిహేను రోజులు గడిచాయి. ఆ రోజు ఎటువంటి పరిస్థితుల్లోనైనా కొంత ప్రగతి సాధించాలనుకున్నాడు.

వేళ్ల చివర పట్టుదలని గట్టిగా బిగపట్టి, మనసులో ఆలోచనలన్నిటినీ పక్కకు నెట్టి, గంట సేపు కుంచె కదిపాడు. చివరికి చూసుకుంటే – అతడి మనసులాగా అస్పష్టంగా, అయోమయంగా– ముందు వేసింది కూడా పాడై...

...దుఃఖమొచ్చింది. కేన్వాస్ లాగేసి ముక్కలు చేశాడు. ఖాళీ ఫ్రేము వెక్కిరించింది. హాల్లోంచి బయట చీకట్లోకి వచ్చాడు. దూరంగా సముద్రం సానుభూతిగా చూసింది. *నాకేం కావాలి? నాకేం కావాలి?* అని రుద్ధకంఠంతో తనలో తానే గొణుక్కున్నాడు.

ఇసుక తిన్నెల మీద గమ్యం లేకుండా నడిచాడు. సముద్రం మీద చీకటి అతడి మనసులో చీకటిని చూసి చిన్నబోయింది. అతడి దిగులు కొబ్బరాకుల మధ్య గాలిలో కదిలింది. ఆ క్షణం తనంత ఒంటరి ఈ ప్రపంచంలో ఇంకెవరూ ఉండనంతగా వణికిపోయాడు. దేశానికి దూరంగా చుట్టూ సముద్రం... మధ్యలో దీవి... దీవి మధ్యలో ఒంటరిగా... ఇక్కడి ఆలోచనలు ఎక్కడికో వెళ్ళిపోతూ...

ప్రేమంటే, ‘మనం లేనప్పుడు అవతలి వ్యక్తి మన గురించిన దిగులుతో అనుక్షణం ఆలోచిస్తూ ఉంటారన్న’ నమ్మకం. నమ్మకం పోతే ఇక అంతా దిగులే. దిగులంటే కళ్ళ ముందే సాయంకాలపు రంగులు చీకట్లో అదృశ్యమవటం. ఒంటరితనమంటే చెంపమీద జారే నీటి చుక్క ఆరటానికి గాలి కూడా సహకరించకపోవటం.

ఒకప్పుడు అతడు తన ఆకలిని చిరునవ్వుతో, అవతలివాళ్ళ కోపాన్ని తన సహనంతోనూ, విసుగుని క్షమతోనూ సహించాడు. ఇలాటి మనుషులు కూడా ఉంటారా అన్నట్టు నిలిచాడు. కాండాన్ని అలాగే ఉంచి లోపలంతా డొల్లచేసే

పురుగులాగా అసంతృప్తి అతడిని లోలోపలే దొలిచేస్తూ వచ్చిందని గుర్తించలేకపోయాడు. ఈ అసంతృప్తికి కారణం మాత్రం అతడికి తెలియలేదు. లోకమంతా నిద్ర పోతున్న చీకటి రాత్రి ఒక మొగ్గ పూవై విరిస్తే విచ్చుకుని ఉండవచ్చు గాక. మరొక పువ్వు అంత నిశ్శబ్దంగానూ నేలరాలి పోయేది కూడా చీకటిరాత్రే.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments